

# ఊహా సుందరి

★

రచన : శ్రీమతి ఎన్. పద్మావతి

(గత సంచిక తరువాయి)

ఆడబోయే తీర్థం ఎదురైనట్లుంది. తన మనస్సులోని ఆలోచనని, చదివినట్లే మాట్లాడుతున్నాడే! కల్యాణిలో ఆనంద తరంగాలు ఉవ్వెత్తున ఎగిరిపడుతుండగా, సంతోషంతో ఉక్కిరి బిక్కిరయ్యింది, అతి కష్టంమీద గొంతువిప్పి—

"ఉండండి, వస్తా నొక్క క్షణం అంటూ చెంగున పరుగెత్తి, బీర్వాలో భద్రంగా దాచిన కాగితాల కట్టతో వేగంగా తిరిగి వచ్చింది.

కాగితాలు అతని చేతికి ఇస్తూ "చదివి చూడండి, నచ్చితే" అంది సిగ్గుగా.

"ఈజిట్, మీరు రాసిందేనా? మరి చెప్పారు కారేం" అన్నాడు ఆశ్చర్యంతో తలమునకలౌతూ.

"నేనప్పుడే ఎక్స్‌పెక్ట్ చేశాను." అన్నాడు కాగితాలు తిరగేస్తూ.

"మీకు నచ్చుతుందో నచ్చదో? ఏదో ఇదే ఫస్ట్‌టైం రాయడం" అంది సంజాయిషీ చెప్పుకుంటున్న విద్యార్థినిలా.

"దేనికైనా పంపించారా?" అన్నాడు.

"లేదండీ, ఏమో కొత్తవాళ్ళని వేసుకుంటారో, లేదోనని సందేహిస్తున్నానండీ. మీరు చదివి చూడండి, అప్పుడు కావలిస్తే ఏ పత్రికకైనా పంపిస్తాను" అంది.

"మరి పత్రికల కెందుకండి, డైరక్ట్‌గా సినిమాయే తీసేద్దాం" అన్నాడు.

"మీకు నచ్చాలిగా" అంది సంశయంగా.

"వాట్ నచ్చకపోవడమే, ఇంతందమైన అమ్మాయి రాసింది."

"అందమైన వాళ్ళే అందమైన కథలు రాస్తారా?"

"అహా, అవి కాదనుకోండి అందమైన వాళ్ళు రాసినవి, అసహ్యంగా మాత్రం వుండవని నా అభిప్రాయం" అన్నాడు తడబడుతూ.

ఇంతలో దశరథరామయ్యగారు రావడంతో సంభాషణ ఆగిపోయింది, తెల్లవార్లూ నిద్రలేకుండా దొర్లింది; హాల్లో పడుకున్న అతనివైపు చూస్తూ-

చీకటితోనే లేచి కాలకృత్యాలు తీర్చుకుని, మామూలుగా పనులు మొదలుపెట్టేస్తుంది, అతను ఏమి చెప్తాడో, అనుకుంటూ ఎదురు చూస్తోంది గడియొక యుగంలా.

"రాత్రి చదివారా? ఎలాఉందండీ?" అంటూ ఆత్రతగా ప్రశ్నించింది కాఫీయిస్తూ.

"సూపర్బ్, అద్భుతంగా ఉందండీ, తీస్తే ఇదే పిక్చర్ తీస్తానండీ, ఇన్నాళ్ళకి నాకు నచ్చిన కథ దొరికింది." అన్నాడు తృప్తినిండిన స్వరంతో.

మరి ఆనందం పట్టలేక పరుగున దేవుడిగదిలోకి నడిచి, గబగబా వెంకటరమణమూర్తి ఫోటోకి రెండుచేతూలూ జోడించింది. ఇల్లంతా ఆనందంతో తిరగసాగింది.

ఆ మధ్యాహ్నం బయలుదేరుతూ దశరథరామయ్యగారితో కూడా చెప్పాడు అనిల్ కుమార్ "తను వెళ్ళి స్క్రిప్టు రాయించి, షూటింగ్ మొదలైనపుడు లెటర్ రాస్తాను, అమ్మాయిని తీసుకరండి" అంటూ.

ఇదంతా ఓ గారడీ జరుగుతున్నంత వింతగా, తన కూతురిలో తలమునకలౌతున్న తండ్రిని చూసి గర్వంగా నవ్వుకుంది.

వెంటనే వెళ్ళి ఫ్రెండ్స్‌ందరితో చెప్పివచ్చిందా వార్త. "అయ్యో మాకు చెప్పావుకాదేం, అతనిని

మేమూ చూద్దుంకదా?. మమ్మల్ని మర్చిపోకేం ఇంక" అన్నారు హాస్యంగా.

రోజూ పోస్టుమేన్ కోసం ఎదురు చూస్తోంది. దశరథ రామయ్యగారి పేరున రాసాడు అమ్మాయిని తీసుకు రమ్మని అనిల్ కుమార్. తండ్రితో బయలుదేరింది మద్రాసు. తాను ఎప్పుడూ సినిమాల్లో తప్ప చూడని తారలందిరినీ చూస్తూ, వారితో మాట్లాడుతూ, స్వర్గంలో విహారిస్తున్నట్లుగడిపింది మద్రాసులో ఉన్నన్నిరోజులు.

తిరిగివచ్చేరోజు ట్రైన్ ఎక్కించడానికి వచ్చిన అనిల్ కుమార్ ఒంటరిగా ఉన్న కళ్యాణితో అన్నాడు.

"కళ్యాణీ నేనోవరం కోరుతాను, ఇస్తారా?" అని.

"ఏమిటో చెప్పండి," అంది సిగ్గుగా, అతను అడగబోయేది ముందుగానే ఊహిస్తూ.

"మీరు నా జీవిత భాగస్వామి కాగలరా?" అన్నాడు సూటిగా కళ్ళల్లోకి చూస్తూ.

"అంత అదృష్టమా తనకి?" అనుకుని లోలోనే పొంగిపోతూ, నాన్నగారితో మాట్లాడండి, అంది సిగ్గు బరువుతో కంపిస్తున్న గొంతుతో.

"థ్యాంక్యూ" అంటూ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకొని ముద్దుపెట్టుకున్నాడు.

* * *

దశరథరామయ్యగారి అంగీకారంతో అనిల్ కుమార్ కళ్యాణిల కళ్యాణం వైభవంగా జరిగింది.

ఆరోజు మొదటిరాత్రి, కళ్యాణి పిక్చర్ "ఊహా సుందరి" రిలీజ్ డే. ఫస్టుడే ఫస్టుషో చూసివచ్చేరు దంపతులు.

అగరొత్తుల ధూపంతో మల్లెపూల పరిమళంతో మత్తుగా ఉన్న ఆ వాతావరణంలో తృప్తిగా భర్తగుండెల్లో తలదాచుకున్న కళ్యాణి హృదయం "మ్రోగింది వీణా" పదే పదే పాడుకుంటోంది.

"ఏం మమ్మాయ్, ఇక్కడ నిల్చున్నావ్?" అన్నారు. గేటుకానుకుని కళ్ళుమూసి తన్మయావస్థలోనున్న కూతురిని చూస్తూ.

తుళ్ళిపడి కళ్ళు తెరచి జరిగినదంతా కలా? అనుకుంది, బాధగా మూల్గిందామె హృదయం.


యెలెన్

ELLEN

ISI

మోటారు మరియు పంపులు

ఆంధ్ర ప్రభుత్వముచే అధికారము పొందియున్నది.



Manufacturers of :-

Single Phase Motors, 3 Phase Motors Centrifugal Pumps, Domastic Pumps Domestic Mono Blocks and Jet Pumps, Jet Mono Blocks.



FOR PARTICULARS

ELLEN INDUSTRIES

Peelamedu, Coimbatore-641 004.

: బ్రాంచి :

యెలెన్ ఇండస్ట్రీస్

7-8-177, ఘన్‌మండి, సికిందరాబాదు-3 (ఎ.పి.)

అయినా ఆకాశదీపం ఏమూలో అంతరిస్తూంటే, తండ్రి వెనకే లోనికి నడిచి, లెటర్ అందించింది. "అనిల్ కుమార్ట" వచ్చారు అంటూ. ఏమిటి? ఆయన వచ్చారా? తనురాలేనని అన్నారే ఆశ్చర్యంగా అంటూ లెటర్ తెరిచి చదివి.

"ఓ రామారావా! వచ్చింది." అన్నారు.

అయోమయంగా చూస్తున్న కూతురివైపు చూస్తూ, చూడమ్మాయ్ ఆ మధ్య పెళ్ళికెళ్ళాను గుర్తుందికదూ, రఘురామయ్యకూతురి పెళ్ళికని వచ్చింది అతనమ్మా వచ్చింది. రఘురామయ్య అల్లుడు అన్నాడు.

వెంటనే గుర్తొచ్చింది. అవును తండ్రి అప్పుడు చెప్పాడు, పెళ్ళి కొడుకుకి రెండు కళ్ళూ మెల్ల అందుకని ఎప్పుడూ కళ్ళ జోడు పెట్టుకునే ఉంటాడని.

"వైజాగ్‌లో ఉన్న మనిల్లు అనిల్ కుమార్ గారు కొంటారన్నారు, రఘురామయ్య కూతురి పెళ్ళిలో కలిసినపుడు ఆ విషయమెరాశారు. రిజిస్ట్రేషన్ డేట్ ఫిక్స్ చెస్తేవస్తానని. వాళ్ళబ్బాయి డాక్టరు, వైజాగ్‌లో ప్రాక్టీసు పెడ్తానంటున్నాడు" అన్నారు.

"మరి ఫిలిం ఇనిస్టిట్యూటు కదా "అంది నీళ్ళుకరి పోతున్న ఆశతో.

"అబ్బా ఆ గొడవలేవీ పడలేను రిజైన్ చేసి వచ్చేస్తున్నాను. అన్నారామధ్య కలిసినపుడు." అన్నారులాల్చి విప్పుకంటూ.

ఎక్కడో దూరంగా లౌడ్ స్పీకర్‌లోంచి వినిపిస్తున్న "మ్రోగింది వీణా" అన్నపాట వెక్కిరిస్తున్నట్లనిపించి గబగబా వంటింట్లోకి నడిచింది కలకరిగిన కళ్యాణి.

---

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రము బాధ్యులుకాదు. —సంపాదకుడు.

---

Grams: "SHIVAJITEX" Phone: 23616




**T. MARIMUTHU**

Handloom Weaving Factory

SELLUR, MADURAI-625 002.

టి. మారిముత్తు

హేండ్‌లూమ్ వీవింగ్ ఫ్యాక్టరి,

సెల్లూర్ : : మధురై - 625 002.